సాక్షి
విశాఖపట్నం
మంగళవారం। 17। జనవరి। 2023


నాట్యం ఆయన జీవితం 8లో


ఉప్పొంగిన భక్తిభావం
పోటెత్తిన జనం 8లో


వావ్.. తెలుగు మ్యూజియం 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి స్టాఫ్ నర్సుల ఉద్యోగాలకు కౌన్సెలింగ్

మహారాణిపేట (విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సుల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలన, కౌన్సెలింగ్ నిర్వహించేందుకు వైద్య ఆరోగ్యశాఖప్రాంతీయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మంగళ, బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ అధికారులు నిర్ణయించారు. పోస్టుల సంఖ్య పెరగడం, కోవిడ్ సమయంలో పనిచేసిన వారికి అదనపు మార్కులు కలపడం వంటి నిర్ణయాలు రావడంతో మళ్లీ మెరిట్ లిస్టుకు తుది మెరుగులుదిద్ది శనివారం వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర కమిషనర్ అభ్యర్థుల ఎంపిక జాబితాను విడుదల చేసిన సంగతి తెలిసిందే. మొత్తం ఆరు జిల్లాల అభ్యర్థులను ఎంపిక చేసి పోస్టింగ్ ఆర్డర్ ఇస్తామని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ అధికారి డాక్టర్ ఉమా సుందరి చెప్పారు.

రద్దీగా ఉన్నరూట్లలో ప్రత్యేక బస్సులు


సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ అప్పలనాయుడు

అల్లిపురం (విశాఖ దక్షిణ): సంక్రాంతి ముగిసిన తరువాత తిరుగు ప్రయాణానికి రద్దీగా ఉన్న రూట్లలో ప్రత్యేక బస్సులను నడుపనున్నట్టు డిప్యూటీ మెకానికల్ ఇంజినీర్ బి.అప్పలనాయుడు తెలిపారు. సోమవారం ఆయన విశాఖపట్నం డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులు మార్గమధ్యంలో ఎటువంటి అవంతరాలు రాకుండా మెకానికల్ సిబ్బంది, డ్రైవర్స్, కండక్టర్స్ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు స్పెషల్ బస్సులు సక్రమంగా తిప్పి, మంచి ఆదాయం తెచ్చినందుకుగాను సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ గంగాధర్, అసిస్టెంట్ ఇంజినీర్ ఎం.ఎస్.నాయుడు, స్టోర్స్ సూపర్‌వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యశాఖ ఇన్‌చార్జి జేడీగా విజయ

మహారాణిపేట: మత్స్యశాఖ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్‌గా జి.విజయ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సుమలతను కాకినాడలో స్టేట్ ఫిషరీస్ ఇనిస్టిట్యూట్‌కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమించారు.

వయ్యారి గాలిపటం.. పైపైకి ఎగిరే..



సంక్రాంతి సంబరాల్లో భాగంగా సాగర తీరంలో పతంగులు (గాలిపటాలు) పైపైకి ఎగిరి ఆనందాన్ని పంచాయి. సంక్రాంతి వేళ ఇతర ప్రాంతాలవారు స్వస్థలాలకు తరలిపోగా నగరవాసులు మాత్రం బీచ్ రోడ్డులో గాలిపటాలను ఎగరేస్తూ పండుగ చేసుకున్నారు. పెద్ద సంఖ్యలో పతంగులు ఆకాశంలోకి ఎగరడంతో నింగి రంగులమయమైంది. వివిధ ఆకృతుల్లో ఉన్న పతంగులు ఆకాశంలో సర్రున ఎగురుతూ పక్షులను తలపించాయి.

– బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు)






సింధుకీర్తినందుకుందాం

- సుదీర్ఘ విరామం తర్వాత షిప్‌యార్డ్‌కు సింధుకీర్తి సబ్‌మెరైన్
- ఏడేళ్ల క్రితం ఇదే జలాంతర్గామి మరమ్మతుల విషయంలో అపప్రధ
- తాజాగా మరోసారి సింధుకీర్తి మరమ్మతులు హెచ్‌ఎస్‌ఎల్‌కు అప్పగింత



సాక్షి, విశాఖపట్నం: హిందుస్థాన్ షిప్‌యార్డు చరిత్రలో మాయని మచ్చగా నిలిచిన రోజుని చెరిపేసే అవకాశం వచ్చింది. ఎన్నో సబ్‌మెరైన్లకు మరమ్మతులు పూర్తి చేసినా సింధుకీర్తి విషయంలో మూటకట్టుకున్న అపప్రధ ఇంకా షిప్‌యార్డుని వెంటాడుతూనే ఉంది. హెచ్‌ఎస్‌ఎల్‌కు సుదీర్ఘ విరామం తర్వాత వచ్చిన సింధుకీర్తి మరమ్మతుల్ని నిర్ణీత సమయంలో పూర్తి చేసి.. గతంలో పోయిన ప్రతిష్టని తిరిగి సంపాదించుకునేందుకు షిప్‌యార్డు నడుంబిగించింది.

1990 జనవరి 4న భారత నౌకాదళంలోకి ప్రవేశించిన ఐఎన్‌ఎస్ సింధుకీర్తి సబ్‌మెరైన్.. జూన్ 2006లో మరమ్మతులకు గురైంది. రీఫిట్ పనుల బాధ్యతను హిందూస్థాన్ షిప్‌యార్డు (హెచ్‌ఎస్‌ఎల్)కు ఇండియన్ నేవీ అప్పగించింది. అయితే కారణాలేవైనా సింధుకీర్తి మరమ్మతుల విషయంలో హెచ్‌ఎస్‌ఎల్ చాలా ఆలస్యం చేసింది. మూడేళ్ల సమయం కోరిన షిప్‌యార్డు ఏకంగా తొమ్మిదేళ్ల పాటు సుదీర్ఘంగా మరమ్మతులు చేసింది. షిప్‌యార్డు చేసిన ఆలస్యానికి సింధుకీర్తి సబ్‌మెరైన్‌కు డాక్‌యార్డు క్వీన్ అనే పేరుని కూడా మూటకట్టుకుంది. చివరికి 2015లో రూ.912 కోట్ల ఖర్చుతో సింధుకీర్తి మరమ్మతులు పూర్తి చేసి నౌకాదళానికి అప్పగించారు. దీంతో షిప్‌యార్డుకు మరమ్మతులకు పంపించాలంటేనే అనేక సంస్థలు ఆలోచించడం మొదలుపెట్టాయి. ఫలితంగా హెచ్‌ఎస్‌ఎల్‌కు ఆర్డర్లు రావడం తగ్గుముఖం పట్టడంతో ప్రతిష్టకు భంగం కలిగింది.

రికార్డు స్థాయిలో మరమ్మతులు పూర్తి చేసినా...

సింధుకీర్తి కారణంగా ఎదురైన అవమానాలను భరించి.. మరమ్మతుల విషయంలో ఎన్నో సంస్కరణలు చేపట్టారు. ఆధునిక సాంకేతికతని అందిపుచ్చుకుంటూ.. నిర్దేశించిన కాలపరిమితిలోపే రీఫిట్ పనులను పూర్తి చేసేందుకు సిద్ధమని ప్రకటించింది. అయినా ఆర్డర్ల విషయంలో నిరాశే ఎదురైంది. మరోసారి భారత నౌకాదళం చొరవ తీసుకొని సింధువీర్ సబ్‌మెరైన్ మరమ్మతుల బాధ్యతను షిప్‌యార్డుకు అప్పగించింది. రికార్డు స్థాయిలో కేవలం 27 రోజుల్లోనే రీఫిట్ పనుల్ని పూర్తి చేసి సబ్‌మెరైన్‌ను నేవీకి అప్పగించడంతో హెచ్‌ఎస్‌ఎల్‌పై విశ్వాసం పెరిగింది. ఆ తర్వాత నుంచి వెనుదిరిగి చూసుకోలేదు

22 నెలల్లో పూర్తి చేసేందుకు కసరత్తు

ఎలాంటి నౌకలు, సబ్‌మెరైన్ల మరమ్మతులైనా రికార్డు సమయంలో పూర్తి చేస్తూ ఆయా సంస్థలకు అప్పగిస్తున్న హెచ్‌ఎస్‌ఎల్.. ఇప్పుడు ప్రధాన నౌకా నిర్మాణ కేంద్రంగా దూసుకుపోతోంది. ఐదేళ్ల కాలంలో ఏకంగా 14 ప్రాజెక్టుల్ని పూర్తి చేసి ఆర్డర్ల పెండెన్సీ గణనీయంగా తగ్గించుకుంది. 40 నౌకల రీఫిట్ పనులను ఐదేళ్ల కాలంలో పూర్తి చేసి ఔరా అనిపించుకుంది. ఇప్పటి వరకూ 200 నౌకలు తయారు చేసిన షిప్‌యార్డు.. తాజాగా 2000 షిప్స్ మరమ్మతులను కూడా పూర్తి చేసింది. అయినప్పటికీ సింధుకీర్తి మరమ్మతుల అపవాదు వెంటాడుతూనే ఉంది. దాన్ని పూర్తిగా చెరిపేసే అవకాశం షిప్‌యార్డుకు వచ్చింది. సుదీర్ఘ విరామం తర్వాత సింధుకీర్తి సబ్‌మెరైన్ మరమ్మతుల కోసం షిప్‌యార్డుకు చేరుకుంది. 2015 తర్వాత వచ్చిన సింధుకీర్తి రీఫిట్ పనుల్ని 22 నెలల్లో పూర్తి చేస్తామంటూ రక్షణ మంత్రిత్వ శాఖతో హెచ్‌ఎస్‌ఎల్ ఒప్పందం కుదుర్చుకుంది. ఏ సబ్‌మెరైన్ విషయంలో అపవాదు మూటకట్టుకుందో.. అదే సబ్‌మెరైన్ రీఫిట్ పనుల్ని నిర్ణీత సమయం కంటే ముందుగానే పూర్తి చేసేందుకు షిప్‌యార్డు సన్నద్ధమవుతోంది. పోయిన ప్రతిష్టని, కీర్తిని, సింధుకీర్తి మరమ్మతులతోనే దక్కించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామని సీఎండీ హేమంత్ ఖత్రీ అన్నారు. 22 నెలల కంటే ముందుగానే అప్పగించేందుకు శాయశక్తులా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

చలికి బ్రేక్!

- సాధారణంకంటే అధిక ఉష్ణోగ్రతలు
- క్రమంగా పెరగనున్న పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు
- ఆగ్నేయ, దక్షిణ గాలులే కారణం

సాక్షి, విశాఖపట్నం: సాధారణంగా ఏటా సంక్రాంతికి చలి వణికిస్తుంది.అతి శీతలంతో జనాన్ని గజగజలాడిస్తుంది. సాధారణంకంటే 2–4 డిగ్రీలు తక్కువగా రాత్రి (కనిష్ట) ఉష్ణోగ్రతలు నమోదవుతూ చలి తీవ్రతను పెంచుతాయి. ఇలా వణికించే చలి నుంచి ఉపశమనం పొందడానికి మంటలు వేసుకుంటారు. దుప్పట్లు కప్పుకుని ఊరట చెందుతారు. ఇళ్ల నుంచి బయటకు రావడానికే వెనకడుగు వేస్తారు. సాయంత్రం మొదలైన అతి శీతలం మర్నాడు ఉదయం పొద్దెక్కే వరకూ కొనసాగుతూనే ఉంటుంది. ఇలా ఏళ్ల తరబడి సంక్రాంతికి కనిపించే వాతావరణ పరిస్థితి. విశాఖలో భోగి ముందు రోజు వరకు ఒకింత చలి ప్రభావం కనిపించింది. కానీ సంక్రాంతి నుంచి చలి ఛాయలు అంతగా కనిపించడం లేదు. చలి గజగజ వణికించడం లేదు. జనాన్ని గదులకే పరిమితం చేయలేదు. కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంకంటే తక్కువకు బదులు ఒకింత ఎక్కువగా నమోదవుతూ చలి తీవ్రతను తగ్గించాయి. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 1–2 డిగ్రీలు ఎక్కువగా రికార్డవుతున్నాయి. జనవరి మూడో వారం ఆరంభం నాటికి విశాఖలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంగా 17–18 డిగ్రీల మధ్య నమోదవుతాయి. కానీ ఇప్పుడు 19–20 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి.

పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు : మరోవైపు పగటి ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతున్నాయి. ఇవి సాధారణంకంటే 2–3 డిగ్రీలు అధికంగా రికార్డవుతున్నాయి. దాదాపు వారం రోజుల నుంచి ఇదే పరిస్థితి కనిపిస్తోంది. విశాఖ నగరంలో గరిష్ట (పగటి) ఉష్ణోగ్రతలు దాదాపు 32 డిగ్రీలు నమోదవుతున్నాయి. దీంతో పగటి వేళ ఎండ ప్రభావం చూపుతోంది.

ఎందుకిలా?

నాలుగైదు రోజుల క్రితం వరకు ఈశాన్య, ఉత్తర గాలులు వీచాయి. ఫలితంగా విశాఖలో 15–17 డిగ్రీల మధ్య రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో చలి ప్రభావం అధికంగా చూపింది. ప్రస్తుతం దక్షిణ, ఆగ్నేయ దిశల నుంచి గాలులు వీస్తున్నాయి. దక్షిణ, ఆగ్నేయ గాలులు సముద్రంపై నుంచి వీస్తుండడం వల్ల కనిష్ట ఉష్ణోగ్రతలు పెరగడానికి దోహదపడుతున్నాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు 'సాక్షి'కి చెప్పారు. మరో రెండు మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని, ఆ తర్వాత మళ్లీ రాత్రి ఉష్ణోగ్రతలు ఒకింత తగ్గే అవకాశాలున్నాయన్నారు. అలాగే తేలికపాటి పొగమంచు కూడా ఏర్పడుతుందని తెలిపారు.

విశాఖ నగరంలో నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	కనిష్టం	గరిష్టం
10.01.23	14.6	30.4
11.01.23	15.0	30.4
12.01.23	17.2	30.4
13.01.23	18.6	31.4
14.01.23	18.2	31.4
15.01.23	19.4	31.8
16.01.23	18.6	31.8

కాటేసిన అతివేగం

- స్తంభాన్ని ఢీకొన్న బైక్
- ఇద్దరు విద్యార్థుల దుర్మరణం


హరిచంద్రప్రసాద్ (ఫైల్)


మడిస కిరణ్ (ఫైల్)

కూర్మన్నపాలెం: అతివేగం కాటేసింది. రెండు నిండు ప్రాణాలను బలితీసుకొంది. కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగిల్చింది. ఇద్దరు విద్యార్థులు అతివేగంతో బైక్‌పై ప్రయాణిస్తూ విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన ఆటోనగర్ వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మడిస కిరణ్(21), వియ్యపు హరిచంద్రప్రసాద్(20) ఇద్దరు స్నేహితులు. సోమవారం సాయంత్రం వీరు ఒకే బైక్‌పై అతివేగంగా ప్రయాణిస్తూ ఆటోనగర్ వ్యాగన్ రైల్వే వర్క్‌షాపు వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మడిస కిరణ్ డిప్లమా పూర్తి చేశాడు. అతడు తండ్రి అప్పలరాజు ఫార్మాసిటీలో పనిచేస్తున్నాడు. తమ్ముడు ఉన్నాడు. వియ్యపు హరి ప్రస్తుతం బీటెక్ చదువుతున్నాడు, తండ్రి చనిపోగా, తల్లి మంగ ఏపీ ట్రాన్స్‌కోలో పనిచేస్తుంది. అతడికి ఒక చెల్లి ఉంది. ఎదుగుతున్న కుమారులు అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడి విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య కార్యవర్గం

అనకాపల్లి టౌన్: ఉమ్మడి విశాఖ జిల్లాల విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య అధ్యక్షునిగా డాక్టర్ మాటూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. బొజ్జన్నకొండ వద్ద సోమవారం జరిగిన ఎన్నికల్లో సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా బోర వేణుగోపాల్ గౌతమ్, కోశాధికారిగా పెయ్యల సిద్ధార్థ, వర్కింగ్ అధ్యక్షునిగా నాగాబత్తుల బాలభాస్కరరావు, సీనియర్ ఉపాధ్యక్షులుగా మాటూరి శ్రీనివాసరావు, ఎం.బొడ్డు కల్యాణరావు, సహాయ కార్యదర్శులుగా కె.రాజుగణేష్, కుంచెల చినదేముడు, బల్లా నాగభూషణం, కొరమాటి అన్నవరం, కాకర నరసింహరాజు, గౌరవ సలహాదారులుగా కె.పి.వి.ప్రసాదరావు, బైపా అరుణ్‌కుమార్, జె.వి.ఝాన్సీలక్ష్మి, రావూరి విజయకుమార్, బీర రత్నకుమారి, చిడిపి సుబ్బారావుతోపాటు మరో 10మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. కమిటీ పదవీకాలం రెండు సంవత్సరాలు.

వాహనాల దగ్ధంపై విచారణ


మాట్లాడుతున్న డీసీపీ-2 ఆనందరెడ్డి

మద్రిపాలెం: కంచరపాలెం పోలీసు స్టేషన్‌లో వాహనాలు దగ్ధమైన సంఘటనపై విచారణ జరుపుతున్నట్టు డీసీపీ–2 ఆనందరెడ్డి తెలిపారు. ఆదివారం కంచరపాలెం పోలీస్ స్టేషన్లో వాహనాలు 23 వాహనాలు దగ్ధమయ్యాయి. దీనిపై ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. పోలీస్ స్టేషన్ వెనుక.. జీవీఎంసీ డంపింగ్ యార్డ్‌లో కోర్టు డిస్పోస్డ్ వాహనాలు కాలిపోయినట్టు తెలిపారు. దగ్ధమైన 23 వాహనాలు 2010 నుంచి 2015 మధ్య కంచరపాలెం లా అండ్ ఆర్డర్, ఎయిర్‌పోర్టు క్రైం పోలీస్‌స్టేషన్ల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడినవని పేర్కొన్నారు. ఇందులో 22 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో పూర్తిగా, బొలెరో వాహనం పాక్షికంగా దెబ్బతిన్నట్టు తెలిపారు. ఈ వాహనాల విలువ సుమారు.రూ.90 వేలు ఉంటుందని తెలియజేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నామని, స్టేషన్ వెలుపల వున్న సీసీ పుటేజ్‌లను పరిశీలిస్తున్నామన్నారు. మురళీనగర్ సచివాలయం వీఆర్వో పాలపర్తి వరప్రసాద్ ఫిర్యాదు మేరకు సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐ రవికిశోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వందేభారత్ సందడి

స్పెషల్ రైలుకు ఘన స్వాగతం • విశాఖ నుంచి తొలి ప్రయాణం


విద్యార్థులతో డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): వందేభారత్ స్పెషల్ రైలుకు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ఘన స్వాగతం దక్కింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆదివారం రైలు ప్రారంభోత్సవ కార్యక్రమం జరగ్గా ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రాజమండ్రికి ఆదివారం రాత్రి 7.30 గంటలకు ఈ రైలు చేరుకోగా.. అప్పటికే విశాఖ నుంచి డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ఆధ్వర్యంలో ప్రత్యేక స్పెషల్ రైలులో వెళ్లిన రైల్వే అధికారులు, ట్రైనీలు, వాల్తేరు కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు, మీడియా ప్రతినిధులు అక్కడ ఎక్కారు. ఈ స్పెషల్ రైలు ద్వారపూడి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ స్టేషన్‌ల్లో ఆగుతూ ప్రజాప్రతినిధుల స్వాగత, వీడ్కోల మధ్య రాత్రి 11 గంటల సమయంలో విశాఖ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఇటీవల వాల్తేరు కేంద్రీయ విద్యాలయంలో రైల్వేకు సంబంధించి వివిధ అంశాలపై పలు ప్రత్యేక పోటీలు నిర్వహించగా.. అందులో విజేతలైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఈ రైలులో ప్రయాణించే అవకాశం కల్పించారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు రైలులోనే డీఆర్‌ఎం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. రైల్వేస్టేషన్‌లో ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్ గుప్తా నేతృత్వంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రారంభోత్సవ రైలుకు ప్రత్యక్ష సాక్షులుగా నిలిచిన ప్రజలకు, ప్రయాణికులకు, చాక్లెట్స్, బిస్కట్స్ పంపిణీ చేసి ఆనందం వ్యక్తం చేశారు.

దువ్వాడ వరకు ఎంపీ సత్యవతి ప్రయాణం

వందేభారత్ స్పెషల్ రైలు అనకాపల్లి స్టేషన్‌కు చేరుకునే సరికి అప్పటికే అక్కడ ఉన్న ఎంపీ డాక్టర్ భీశెట్టి సత్యవతి పార్టీ శ్రేణులతో కలిసి ఘన స్వాగతం పలికారు. ఆమె ఈ స్పెషల్ రైలులో దువ్వాడ వరకు ప్రయాణించారు.


సోమవారం ఉదయం విశాఖ నుంచి బయలుదేరిన వందేభారత్

విశాఖ నుంచి ఉదయం 5.45 గంటలకు..

విశాఖపట్నం–సికింద్రాబాద్ (20833) మధ్య నడిచే వందేభారత్ రైలు విశాఖపట్నంలో సోమవారం నుంచి ఉదయం 5.45 గంటలకు బయల్దేరింది. ఇది మధ్యాహ్నం 2.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంది. ఈ రైలు తిరుగు ప్రయాణంలో (20834) సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి రాత్రి 11.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంది. ఈ రైలు రాజమండ్రి, విజయవాడ, ఖమ్మం, వరంగల్ స్టేషన్‌లలో మాత్రమే ఆగుతుంది.

'సిటీ'జన్ వ్యూ


నిర్మానుష్యంగా ఎల్ఐసీ రోడ్డు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): నగరంలో ఓ వైపు రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిస్తే.. మరోవైపు సాగరతీరం సందర్శకులతో పోటెత్తింది. నిత్యం రద్దీగా ఉండే పలు జంక్షన్లు బోసిపోయాయి. ఆర్టీసీ కాంప్లెక్స్, సిరిపురం, వీఐపీరోడ్డు, రైల్వేస్టేషన్, మద్దిలపాలెం రహదారుల్లో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అటువంటిది సోమవారం జనం లేక నిర్మానుష్యంగా మారాయి. ఆర్కే బీచ్‌కు మాత్రం నగరవాసులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పిల్లాపాపలతో ఆటపాటలతో సందడి చేశారు.


బోసిపోయిన కాంప్లెక్స్ రోడ్డు


బీచ్‌లో జనాల సందడి

ఆలయాలకు అభయం

- ధూప, దీప, నైవేద్యం పథకం కింద సాయం
- ప్రస్తుతం ఉమ్మడి విశాఖలో 37 ఆలయాల్లో అమలు
- గ్రామీణ ప్రాంతాలకు ప్రాధాన్యం



మహారాణిపేట(విశాఖ దక్షిణ): పెద్దగా ఆదాయం లేని ఆలయాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభయమిచ్చింది. ధూప, దీప, నైవేద్యం పథకం(డీడీఎన్‌ఎస్) కింద సాయం చేస్తోంది. పట్టణాల్లో కన్నా గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ పథకం కింద ఆలయ నిర్వహణ కోసం అర్చకుడికి నెలకు రూ.5 వేలు అందిస్తున్నారు. ప్రతి గ్రామంలో కనీసం ఒక ఆలయాన్ని ఈ పథకం కిందకు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఇందు కోసం దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 37 ఆలయాల్లో ఈ పథకం అమలవుతుంది. అనకాపల్లి జిల్లాలో 35 ఆలయాలు, విశాఖలో 2 ఆలయాలు ఉన్నాయి. ఈ ఏడాది విశాఖలో 25 ఆలయాల్లో పథకం అమలుకు అనుమతి లభించింది. గ్రామంలో 25 సంవత్సరాల చరిత్ర గల ఆలయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధూప, దీప, నైవేద్యం పథకం(డీడీఎన్‌ఎస్) కోసం ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం ఆలయాలను ఎంపిక చేస్తాం. పూర్తి వివరాలతో దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేయాలి.ఇతర వివరాలకు దేవదాయ శాఖ అధికారులను సంప్రదించాలి.

– కె.శిరీష, జిల్లా సహాయ కమిషనర్, దేవదాయ శాఖ, విశాఖపట్నం,

నాట్యం ఆయన జీవితం

- నవరసభరితం నృత్యాభినయం
- నాలుగు తరాలుగా నాట్యానికే అంకితం
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని కాదని సంప్రదాయ నృత్యమే ప్రాణంగా
- నాట్య గురువుగా రాణిస్తున్న ఉదయ్ శంకర్ పొట్నూరు



ఉదయ్ శంకర్ శివతాండం నృత్యం



గాన గంధర్వుడు బాలసుబ్రహ్మణ్యం నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న ఉదయ్ (ఫైల్)



జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి చేతులు నాట్యభూషణ్ అవార్డు స్వీకరిస్తున్న ఉదయ్ శంకర్

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): తాతముత్తాలు కళాకారులు. తెలుగు సంస్కృతీసంప్రదాయాలు కాపాడడంలో వారికి వారే సాటి. ఆ కుటుంబంలో ఓ యువకుడు నాట్యమే ప్రాణంగా అడుగులు వేశాడు. పాశ్చాత్య యుగంలో ఐదెంకెల సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలేసి..నాట్యమే ఊపిరిగా కళామతల్లి సేవలో నిమగ్నమయ్యాడు. కుటుంబంలో నాలుగవ తరం నర్తకుడిగా, నాట్య శిక్షణాధక్షుడిగా తన జీవితాన్ని అంకితం చేశాడు. నాట్యంలో మాస్టర్ డిగ్రీలు పూర్తి చేశారు. భావితరాలకు మన సంస్కృతీ సంప్రదాయాలను అలవర్చాలని ఆకాంక్షతో తరాలుగా వస్తున్న నాట్యానికి జీవం పోశారు.. విశాఖ నగరానికి చెందిన అంబికేశ్వరి డ్యాన్స్ అకాడమి నాట్య గురువు ఉదయ్ శంకర్ పొట్నూరి. తన నాట్య విన్యాసాంతో ఖండాంతర ఖ్యాతీ నార్జించిన తీరు ఎందరికో స్ఫూర్తిదాయకం. నాట్య రంగంలో ఎదిగిన తీరు ఆయన మాటల్లోనే...

వందేళ్ల క్రితం విశాఖ కేంద్రంగా తన ముత్తాతగారైన హరికథా భాగవతారు పొట్నూరు వెంకటస్వామి సంగీత శిక్షణకు శ్రీకారం చుట్టారు. 1923లో ఆనాటి కుగ్రామమైన గంగవరంలో హరికథభాగవతారుగా సంగీతంలో శిక్షణ ప్రారంభించారు. తన ముత్తాత వద్ద తాతగారైన పొట్నూరు వెంకట నరిసింహారావు తొలి శిష్యుడుగా సంగీతం నేర్చుకున్నారు. తర్వాత శాస్త్రీయ సంగీతం, నృత్యాన్ని బొబ్బిలిలో టి.వి.నరిసింగరావు వద్ద శిక్షణ తీసుకున్నారు. శిక్షణానంతరం 1945లో తాతగారైన పొట్నూరి నరిసింహారావు నాటరాజ హంస నాట్య సంగీత కళామందిర్ అనే సంస్థను స్థాపించారు. శాస్త్రీయ నృత్యానికి, సంగీతానికి విశాఖలో తొలి గురువుగా నిలిచారు. వారి వారసత్వంగా మా తండ్రిగారైన పొట్నూరి విజయ భరణి శంకర్ 1962లో మద్రాసులో వెంపటి పెద్ద సత్యం వద్ద కూచిపూడిలో శిక్షణలో చేరారు. అక్కడ ప్రపంచ ప్రఖ్యాత నాట్యకళాకారుడు వెంపటి చినసత్యంతో ఏర్పాడిన పరిచయం కూచిపూడి నృత్యంలో రాణించాలనే అసక్తిగా పెంచింది. విశాఖలో కూచిపూడి నృత్యాన్ని యువతరానికి అందించాలని 1982లో శ్రీ అంబికేశ్వర కూచిపూడి డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమి స్థాపించారు.

నాలుగో ఏటనే కూచిపూడి నృత్యంలో శిక్షణ

నాలుగో ఏటా అంటే 1989 తండ్రి పొట్నూరి విజయ భరణి శంకర్ వద్ద తొలి నాట్యపు అడుగులు వేయడం ఆరంభించా. కూచిపూడిలో తనను నాట్యకారుడిగా, నాలుగో తరం వారసుడిగా నాన్న తీర్చిదిద్దారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం విడిచిపెట్టి..

ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో 2006లో ఐదెంకల ఉద్యోగంలో చేరాను. అక్కడి పాశ్చాత్య సంస్కృతి పోకడలకు ఇమడలేక, కూచిపూడి నృత్యంపై ఉన్న మక్కువతో ఆ ఉద్యోగానికి రిజైన్ చేశా.

భరతనాట్యంలో మాస్టర్ డిగ్రీ..

తమిళనాడులోని తంజావూరులోని శాస్త్ర యూనివర్సిటీలో భరతనాట్యలో మాస్టర్ డిగ్రీ లో చేరి పూర్తి చేశారు. యూనివర్సిటీలో హెచ్‌వోడీగా పనిచేస్తున్న పద్మభూషణ్ డాక్టర్.పద్మా సుబ్రహ్మణ్యం వద్ద భరతనాట్యంలో శిక్షణ తీసుకున్నా. తొలి ప్రదర్శనను మద్దిలపాలెం కళాభారతిలో 1997లో సోలోగా ప్రదర్శన ఇచ్చాను. కూచిపూడి నృత్యంలో 2006లో మద్రాసులో ప్రముఖ దర్శకుడు, కళారత్న కె.విశ్వనాథం సమక్షంలో అరంగ్రేటం చేశా.

ప్రదర్శనలు– అవార్డులు

- 1996లో గానగంధర్వరుడు ఎస్పీబాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా మదనపల్లిలో భరతముని ఫిల్మ్ అవార్డు కార్యక్రమంలో సత్కారం
- 1998లో అప్పటి గవర్నర్ రంగరాజన్ చేతుల మీదుగా మదనపల్లిలో సత్కారం
- 2012 లో హైదరాబాద్‌లో జరిగిన అవార్డు కార్యక్రమంలో కవి.రచయిత జ్ఞానపీఠ్ గ్రహీత సి.నారాయణరెడ్డి చేతులు మీదుగా నాట్యభూషన్ అవార్డుతో సత్కరించారు.
- భారత ప్రభుత్వ సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూరు, తమిళనాడు ప్రభుత్వం సంయుక్తంగా యంగ్ టాలెంట్ అవార్డును 2026–17 సంవత్సరానికి బెస్ట్ మేల్ సోలో కూచిపూడి డ్యాన్సర్ ఆంధ్రా కేటగిరిలో అందజేశారు.

అమెరికా..సింగపూర్‌లలో..



అమెరికా, సింగపూర్ దేశాలలో ఎన్నో నాట్య ప్రదర్శనలు నిర్వహించా. అక్కడ చిన్నారులకు సైతం నాట్యంలో శిక్షణను ఆన్‌లైన్ ద్వారా ఇస్తున్నా. వారి నాట్యకళాకారులు తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నా. భావితరాలకు మన సంప్రదం, సంస్కృతికి అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నా అని ఉదయ్ శంకర్ పేర్కొన్నారు.

ఉప్పొంగిన భక్తిభావం
పోటెత్తిన జనం



సాగరతీరంలో భక్తుల సందడి

- కనుమ రోజు ఘనంగా మాధవస్వామి పండగ
- పాత గంగవరంలోని సాగర తీరంలో సందడే సందడి




పెదగంట్యాడ: భక్తిభావం ఉప్పొంగింది.. భక్తజనం పోటెత్తింది.. ఓ పక్క సముద్ర కెరటాల హోరు.. మరో పక్క భక్తుల హుషారు కారణంగా పాత గంగవరం పులకించింది. పాత గంగవరం.. సముద్రతీరంలో కొలువుదీరిన మాధవస్వామి మహాలక్ష్మి పండగను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మకర సంక్రాంతి మరునాడు మార్గ పౌర్ణమిని పురస్కరించుకుని కనుమ పండగ రోజున స్వామి వారి పండగను ఘనంగా నిర్వహించారు. 500 ఏళ్ల నాటి ఈ ఆలయం ఎంతో విశిష్టతను సంతరించుకుంది. ఇక్కడ పూజలు చేస్తే సకల సంపదలతో పాటు కోరిన కోర్కెలు నెరవేరతాయని భక్తుల విశ్వాసం. సముద్ర తీరంలో కనువిందు చేస్తున్న కొండపై కొలువుదీరిన మాధవస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆహ్లాదకర వాతావరణంలో పెద్దఎత్తున భక్తులు అక్కడకు చేరుకుని సందడి చేశారు. గంగవరం, దిబ్బపాలెం, పెదగంట్యాడతో పాటు గాజువాక, మల్కాపురం, శ్రీహరిపురం, శ్రీనగర్, అగనంపూడి, కూర్మన్నపాలెం, అనకాపల్లి నుంచి భక్తులు కుటుంబ సమేతంగా మాధవస్వామి, మహాలక్ష్మీదేవిలను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అక్కడే సముద్ర తీరంలో వెలసిన సత్యభామ రాయికి పూజలు చేశారు. కొండపై నుంచి సముద్ర తీరంలో సుమారు 20 అడుగుల కిందకు దిగి.. అక్కడ నుంచి 30 అడుగుల పైభాగంలో ఉన్న ఈ శిలకు పూజలు చేయడంతో పాటు మొక్కులు చెల్లించారు. అలాగే చల్లంగా చూడాలని గంగమ్మతల్లిని వేడుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గరికిన అప్పలరాజు, కార్యదర్శి వరిపల్లి అప్పలరాజు, కమిటీ సభ్యులు ముసలయ్య, దేముడు, శివ తదితరులు ఏర్పాట్లు చేశారు. అలాగే భక్తుల కోసం భారీఎత్తున అన్నసమారాధన కార్యక్రమంతో పాటు భజనలు, కోలాటం ఏర్పాటు చేశారు.

సంతానాన్ని ప్రసాదించే సత్యభామ

సంతానం లేని వారు మకర సంక్రాంతి మరునాడు వచ్చే కనుమ పండగ రోజున సత్యభామను కొలిస్తే వారికి పిల్లలు పుడతారని ప్రతీతి. సత్యభామకు పూజలు చేసి మహిళలు పైటకొంగులో చిన్న రాయి ఉంచి ఊయల మాదిరిగా ఊపుతూ మొక్కుకుంటారని, సత్యభామ అనుగ్రహంతో వారికి ఆడపిల్ల పుడితే సత్య, మహాలక్ష్మీ అని, మగ పిల్లవాడు పుడితే మాధవ్ అనే పేర్లు పెడుతుంటారని ఇక్కడి వారు చెబుతున్నారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మాధవస్వామి ఆలయానికి భక్తుల కోసం గాజువాక డిపో నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను నడిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ ఏర్పాట్లు చేశారు.



మాధవస్వామి ఆలయం

ఆలయ అభివృద్ధికి సహకరించాలి



ఆలయానికి భక్తుల ఆదరణ పెరిగింది. అయితే సౌకర్యాలు లేక కొన్ని ఇబ్బందులు తప్పడం లేదు. ఆలయాన్ని ఇప్పుడిప్పుడే అభివృద్ధి చేస్తున్నాం. దాతలు సహకరిస్తే భక్తులకు సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుంది.

–గరికిన అప్పలరాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు

కోర్కెలు తీర్చే మాధవస్వామి



ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. ఇక్కడి మాధవస్వామి, మహాలక్ష్మి దంపతులను దర్శించుకుని కోర్కెలు కోరుకుంటే కచ్చితంగా నెరవేరతాయి. అలాగే సంతానం లేని వారు సత్యభామ రాయి వద్ద పూజలు చేస్తే పిల్లలు పుడతారు.

–వనపిల్లి మసేనమ్మ

దీవెన.. భవితకు నిచ్చెన

- జగనన్న వసతి దీవెనకు కసరత్తు
- పేద విద్యార్థుల చదువులకు తోడ్పాటు
- 18న సచివాలయాల్లో జాబితా ప్రదర్శన
- జిల్లాలో 48 వేల మందికి ప్రయోజనం



విద్యార్థులకు చెక్ అందిస్తున్న అధికారులు(ఫైల్)

విశాఖ విద్య: జగనన్న విద్య, వసతి దీవెన పథకాలు పేద విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసాగా నిలుస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చదువులకు ఆటంకం లేకుండా ఏటా క్రమం తప్పకుండా విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తోంది. ఈ నేపథ్యంలోనే 2022–23 విద్యా సంవత్సరానికి తొలివిడత వసతి దీవెన పథకం అర్హులైన విద్యార్థులందరికీ వర్తింజేసేలా జిల్లా అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. జిల్లా స్థాయిలో నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డి.విరమణమూర్తి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, కాలేజీల నిర్వాహకులను దీనిపై అప్రమత్తం చేస్తున్నారు. కాలేజీల స్థాయిలో బయోమెట్రిక్ అథంటికేషన్ పూర్తయినందున ఈ ఏడాది ఎంతమంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారనేది లెక్క తీస్తున్నారు.

జిల్లాలో 48 వేల మందికి లబ్ధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉన్న 275 కాలేజీల్లో ఏటా సుమారు 1.30 లక్షల మంది విద్యార్థులు డిప్లమో, టెక్నికల్, డిగ్రీ ఆపై స్థాయి కోర్సుల్లో చేరుతున్నట్లు విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. వీరిలో గతేడాది 96 వేల మందికి వసతి దీవెన పథకం మంజూరైంది. ఇందులో విశాఖపట్నం జిల్లాకు సంబంధించి 47,960 మంది విద్యార్థులకు రూ.44,77,25,000లు మంజూరయ్యాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు వసతి దీవెన పథకం అందిస్తున్నారు. ఐటీఐ విద్యకు రూ.10 వేలు, పాలిటెక్నిక్‌కు రూ.15 వేలు, డిగ్రీ ఆపై స్థాయి కోర్సులకు రూ.20 వేలు మంజూరు చేస్తున్నారు. అర్హులైన విద్యార్థులందరికీ ప్రయోజనం అందించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

షెడ్యూల్ ఇలా

2022–23 విద్యా సంవత్సరానికి డిప్లమో, టెక్నికల్, డిగ్రీ ఆపై స్థాయి కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. కాలేజీల్లో చేరిన విద్యార్థులకు గుర్తింపు సంఖ్య ఇచ్చినందున, బయోమెట్రిక్ ధృవీకరణ పూర్తి చేసి జిల్లా అధికారులకు నివేదించారు. సచివాలయాల స్థాయిలో వెల్ఫేర్ కార్యదర్శిల లాగిన్ ద్వారా ఐదంచెల తనిఖీ పూర్తి చేస్తే, ఆ మేరకు రాష్ట్ర స్థాయిలో ఆరంచెల తనిఖీ ద్వారా దీనిని ధృవీకరించనున్నారు. ఈ నెల 18న కాలేజీల స్థాయిలో విద్యార్థుల హాజరు నమోదు చేయాలి. ఇదే రోజు వసతి దీవెన పథకానికి అర్హులైన విద్యార్థుల జాబితాను సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. ఈ నెల 19న అనర్హుల జాబితాను సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. ఈ నెల 28 వరకు అర్హులైన విద్యార్థుల తగిన ధృవీకరణ పత్రాలతో ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లకు దరఖాస్తు చేసుకోవాలి.


అర్హులందరికీ అందిస్తాం



పేద విద్యార్థుల ఉన్నత చదువులకు తోడ్పాటు అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ఆ దిశగానే తగిన కార్యాచరణ రూపొందించాం. కాలేజీ ప్రిన్సిపాల్స్‌కు ఇప్పటికే దీనిపై నిర్దిష్టమైన సూచనలు ఇచ్చాం. అర్హులైన విద్యార్థులందరికీ జగనన్న వసతి దీవెన పథకం అందించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.

– డి.వి.రమణమూర్తి, జేడీ, సాంఘిక సంక్షేమ శాఖ, విశాఖ జిల్లా

పర్యాటక బౌద్ధ కేంద్రంగా బొజ్జన్నకొండ



బొజ్జన్నకొండపై స్థూపం వద్ద ప్రార్థనలు చేస్తున్న వెనరబుల్ ఆయుపాల మహాథేరో, హోషితలు

అనకాపల్లి టౌన్: స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో బొజ్జన్న కొండపై దశల వారీగా అభివృద్ధి జరుగుతోందని విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు మాటూరి శ్రీనివాస్ అన్నారు. ఉమ్మడి విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బొజ్జన్న కొండ దిగువన సోమవారం బౌద్ధ మేళా జరిగింది. మయన్మార్ దేశం బౌద్ధ భిక్షువు వెనరబుల్ ఆయుపాల మహాథేరో, అరుణాచల్‌ప్రదేశ్ బౌద్ధ భిక్షువు హోషితలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కొండ దిగువ భాగం నుంచి బౌద్ధ పతాకంతో కొండపై గల ప్రధాన స్థూపం వరకు శాంతి ఊరేగింపు నిర్వహించారు. గుహలో ప్రధాన స్థూపం వద్ద పుష్పాంజలి, బుద్ధ వందనం, దమ్మదీక్ష నిర్వహించారు. బౌద్ధ భిక్షువులు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాటూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజాప్రతినిధులు రూ.15 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

వావ్.. తెలుగు మ్యూజియం

- కైలాసగిరిపై రూ.5 కోట్లతో ఏర్పాటు
- ఆకర్షణీయంగా రొటేట్ టేబుల్
- సందర్శకుల నుంచి విశేష ఆదరణ



రాజుల విగ్రహాలు



కైలాసగిరిపై తెలుగు మ్యూజియం

ఆరిలోవ(విశాఖ తూర్పు): కైలాసగిరిపై ఏర్పాటు చేసిన తెలుగు మ్యూజియం సందర్శకులకు కనువిందు చేస్తోంది. వింతలు.. విశేషాలతో అబ్బురపరుస్తోంది. వీఎంఆర్‌డీఏ, వరల్డ్ తెలుగు ఫెడరేషన్ సంయుక్తంగా ఐదెకరాల స్థలంలో రూ.5 కోట్ల వ్యయంతో ఈ మ్యూజియంను నిర్మించారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్మించతలపెట్టిన ఈ మ్యూజియం నిర్మాణం అన్నీ పూర్తి చేసుకుని 2015 నవంబరు 19వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చింది.

ఇవీ ప్రత్యేకతలు

తెలుగు మ్యూజియం కైలాసగిరికి తలమానికంగా నిలిచింది. ఇందులో పెద్ద ఆడిటోరియంను ఆకర్షణీయంగా రూపొందించారు. ఆడిటోరియం మధ్యలో రొటేట్ టేబుల్ అమర్చారు. ఈ టేబుల్‌పై 80 మంది ఒకేసారి కూర్చోవడానికి వీలుగా కుర్చీలు ఏర్పాటు చేశారు. ఈ టేబుల్ ఆడిటోరియం లోపల చుట్టూ తిరుగుతుంది. ఇందులో కూర్చుని చూడడానికి నక్షిత్రాలు మాదిరిగా పైన విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. అందులో ఉన్నవారికి ఆడియో, విజువల్ సౌండ్ సిస్టంతో కూడిన మాటలు, పాటలు వినిపిస్తాయి. సుమారు 58 నిమిషాల పాటు ఈ టేబుల్ తిరుగుతుంది. చుట్టూ చరిత్రాత్మక సంఘటనలు తెలిపే వ్యక్తులు, శిల్పాలు అమర్చారు. ఇక్కడ శాతవాహనుల కాలం నాటి నుంచి స్వాతంత్ర్య ఉద్యమ కాలం వరకు ఆంధ్ర రాష్ట్రానికి చెందిన పేరు ప్రఖ్యాతలుగాంచిన ఎందరో మహానుభావుల చిత్ర పటాలు, విగ్రహాలు కొలువుదీరాయి.

శాతవాహనులు, అమరావతి మహాస్థూపం, తెలుగు లిపి, బుద్ధుడు, అజంతా కుడ్య చిత్రాలు, కోటి లింగాలు, ధూళికట్ట, తెలుగు తల్లి, ఆచార్య నాగార్జున, బుద్ధుని పరిత్యాగం, గౌతమీపుత్ర శాతకర్ణ, బ్రహ్మనాయుడు, రాజరాజ నరేంద్రుడు, ఝాన్సీరాణి, అల్లూరి సీతారామరాజు, తాండ్ర పాపారాయుడు, విజయరామగజపతిరాజు, అన్నమాచార్యుడు, త్యాగరాజు, తదితర మహానీయుల విగ్రహాలు కొలువుదీరాయి. వీటితో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి మాజీ ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు, ఉమ్మడి రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఛాయాచిత్రాలు ఏర్పాటు చేశారు.

అన్ని రోజులూ అందుబాటులో..

కైలాసగిరిపై ఈ మ్యూజియం వారంలో అన్ని రోజులూ అందుబాటులో ఉంటుంది. ప్రారంభంలో సోమవారం సెలవు ఉండేది. ఆ రోజు కూడా సందర్శకులు తాకిడి ఎక్కువగా ఉండడంతో సెలవు రద్దు చేశారు. దీని లోపలకు వెళ్లడానికి రూ.20 టికెట్‌గా నిర్ణయించారు. లోపలికి వెళ్లడంతో పాటు ఆడిటోరియంలో రొటేట్ టేబుల్‌లో కూర్చోవడానికి రూ.40 టికెట్ తీసుకోవాలి.



తెలుగు తల్లి, కవుల విగ్రహాలు



ఆడిటోరియంలో రొటేట్ టేబుల్



కవులు, తత్వవేత్తలు తదితర ప్రముఖుల చిత్ర పటాలు